


ఆరున్నరయింది సాయంత్రం. ఆఫీస్‌లో అంతా వెళ్లిపోయారు, బయట వాచ్‌మన్ తప్ప.

"ఇక వెళతాను" అన్నది స్టెనో టైపిస్ట్ కళ్లు దించుకుని నేలవంక చూస్తూ.

'ట్రెరీక్లేన్' ఇరవై ఏళ్ల టైపిస్ట్ జాకెట్‌కీ, చీరకీ మధ్య కనిపిస్తూవున్న రెండు అందమయిన ముడతలవంక చూసాడు. క్లేన్ ఎక్స్‌రే చూపులు భరించలేక కదిలింది స్టెనో.

లేచి ఆ అమ్మాయి చేతిని పట్టుకున్నాడు క్లేన్ కుడిచేతి చూపుడు వేలుతో ఆ అమ్మాయి బుగ్గ నునుపును చేత్తో రాసి పరీక్షిస్తున్నట్లు మృదువుగా అడిగాడు.

"నీ వయసెంతా? స్వీట్ సిక్స్‌టీన్? స్వీటర్ సెవెన్‌టీన్? ఎరోటిక్ ఎయిటీన్?"

"నాకు తెలీదు వదలండి నన్ను." గింజుకుంది స్టెనో టైపిస్ట్ భయంగా, కోపంగా, అసహ్యంగా.

"ఈజీ బేబీ" ... అన్నాడు విదేశీ యువకుడు.

"ఏమిటీ వికారం?" — ఆమె విదిలించింది.

"సింపిల్" నవ్వాడు. నాకు భారతీయులంటే, అందులో ఎరోటిక్ ఎయిటీన్ అమ్మాయి అన్నా, టీజింగ్ ట్వంటీ అమ్మాయిలన్నా, ముఖ్యంగా ఈవిధంగా వుండే అమ్మాయిలన్నా అమిత ఇష్టం."

ట్రెరీక్లేన్ రెండు చేతులతో స్టెనో నడుం చుట్టూ చేతులువేసి, గాలిలోకి ఎత్తి, క్షణాల్లో ఏర్‌కండిషన్డ్ గదిలోకి వెళ్లిపోయాడు. అతని చేతిలో ఆమె రబ్బరు బొమ్మలాగ వుంది — అంతే...

ఆ గదిలోంచి అరుపులు బయటకు వినపడవు. సౌండ్‌ప్రూఫ్ గది అది.

అరగంట తర్వాత ట్రెరీక్లేన్ సిగరెట్ వెలిగించుకుని, "మీకు కట్టుబాట్లు ఎక్కువకాబట్టి చెబితే నీకే నష్టం." అన్నాడు తన బ్రవున్ కలర్ కళ్లతో ఆసక్తిగా చూస్తూ.

అనుకోకుండా తను అలా నాశనం అవగానే షాక్ తగిలినట్లుగా మనసంతా మొద్దుబారిపోయింది స్టెనో టైపిస్ట్‌కి. ఎంతో రిజర్వ్‌డ్‌గా, హుందాగా వుండే క్లేన్ ఇంత దుర్మార్గుడని ఎప్పుడూ అనుమానించలేదు స్టెనో.

తను జరిగింది ఎవరికి చెప్పినా నమ్మరు. నమ్మినా తనకి కీడు తప్ప మేలు జరగదు. తను ఆ ఉద్యోగంలో చేరకముందు అకస్మాత్తుగా రాజీనామా యిచ్చిన ముగ్గురు స్టెనోల గురించి విన్నది తను. ఇప్పుడు ఆ రాజీనామా వెనకాల కారణం అర్థమయింది.

ట్రెరీక్లేన్‌ని ఎవరూ, ఏమీ చేయలేరు. ఆశక్తురాలై అలాగే తలవంచుకుని వుండాలి. లేదా...

రాజీనామా చేసేసింది స్టెనో టైపిస్ట్ మర్నాడు. అంతకన్నా ఇంకేమీ చేయలేకపోయింది.

*   *   *

కర్నాటక రాష్ట్రంలో, సాండూర్ వ్యాలీ ప్రాంతంలో వున్న ప్రయివేట్ ఐరన్ ఓర్ మైన్ నుంచి ఇనుము త్రవ్వి జపాన్‌కు ఎగుమతి చేయటం ఆ కంపెనీ వ్యాపారం.

కొండమీద, సహజంగా ఏర్పడ్డ ఇనుప గనుల నుంచి ఇనుము త్రవ్వి తీసే యంత్రాలు ఎగుమతి చేసిన ఫ్రెంచ్ కంపెనీ రిప్రజెంటేటివ్ ట్రెరీక్లేన్. సంవత్సరం పాటు భారతీయ ఇంజనీర్స్‌కి ఆ భారీ యంత్రాలు వుపయోగించే విధం శిక్షణ ఇవ్వడానికి పంపబడ్డాడు.

నెలలో మూడు వారాలు ఐరన్ ఓర్ ప్రాజెక్ట్ దగ్గర, ఒక వారం ఆ కంపెనీ ఆఫీస్‌లో వుంటాడు క్లేన్ వప్పందం ప్రకారం. బొంబేలో ఆఫీస్‌లో వున్నప్పుడు ఫర్వాలేదు కాని ప్రాజెక్ట్ ఏరియాకి వెళితే స్త్రీ వ్యామోహం వున్న ఆ ఫ్రెంచ్ మనిషికి రోజులు భారంగా గడుస్తాయి.

ఎనిమిది వేల అడుగుల ఎత్తున వున్న కొండ మీద వున్న కంపెనీ గెస్ట్ హౌస్ అన్ని ఆధునిక సదుపాయాలతో, ఇనుప గనుల దగ్గరే వుంది. క్లేన్ అందులో వుంటాడు.

ప్రేల్చడం [బ్లాస్టింగ్] అవగానే, క్రింద కూలే పెద్ద పెద్ద ఇనుప రాళ్ళని జాయింట్ కన్వేయర్ బెల్ట్ ద్వారా, తొమ్మిది వందల మీటర్ల దూరంలో వున్న క్రషింగ్ ప్లాంట్‌కి చేరుస్తారు. క్రషింగ్ ప్లాంట్‌లో చిన్న చిన్న పెళ్ళలుగా చేయబడతాయి పెద్ద రాళ్ళన్నీ. అక్కడ నాలుగు వందల మంది కూలీలు పని చేస్తారు.

ఆ రాత్రి ప్రాజెక్ట్ మానేజర్ ఇంటికి తొమ్మిది వరకి ఆయన ఆహ్వానం మీద వెళ్లి, తన డిన్నర్ అక్కడ చేసి, ట్రెరీక్లేన్ జీప్‌లో బయలుదేరాడు గెస్ట్‌హౌస్‌కి, రాత్రి పది గంటలకి — కొండ మీద వున్న గెస్ట్ హౌస్‌కి.

దాదాపు ఎనిమిది మైళ్ళ పొడవున్న రోడ్డు, క్రింద నుంచి మెలికలు తిరుగుతూ ఎక్కుతుంది పైకి. దానిమీద జీప్స్ తప్ప మరే బళ్ళు వెళ్లవు. కుడివైపు చూస్తే సాండూర్ లోయ. ఎడం వైపు ఎత్తయిన కొండలు. జీప్ హెడ్ లైట్స్ కాంతిలో క్లేన్ పోనిస్తున్నాడు జీప్‌ని కొండమీదకి; రాజీనామా చేసిన ఆ టైపిస్ట్ గురించి, కొత్తగా ఇంటర్వ్యూకి వచ్చిన అమ్మాయి గురించి, విడాకులు ఇచ్చిన తన భార్య గురించి ఆలోచిస్తూ జీప్ నడుపుతున్నాడు క్లేన్.

ఎదురుగా గుంపుని చూసి, మలుపు తిప్పతూ బ్రేక్ వేసి ఆపాడు జీప్‌ని క్లైన్ జీప్ క్రిందకి జారి పోకుండా రక్షణగా హేండ్ బ్రేక్ వేసి ఎదురుగా వున్న గుంపువంక చూసాడు.

అనాగరికులు. మాసిపోయిన బట్టలు. నోట్లో వెలుగుతున్న చుట్టలు, బీడీలు. అందరి చేతుల్లో గునపాలు, పారలు. రోడ్డుకి అడ్డంగా పడివున్న ఓ పెద్ద కొండరాయి. పెట్రోమాక్స్ లైట్లలో పని చేస్తున్న ఆ కూలీలని చూడగానే అర్థమయింది బెర్రీక్లైన్‌కి, జారి రోడ్డుకి అడ్డంగా పడ్డ ఆ కొండ రాయిని తొలగిస్తున్నారని. ఆ రాయిని అడ్డం తొల గిస్తేగాని జీప్ వెళ్లేందుకు దారిలేదు.

దగ్గిరే వుండి పని చేయిస్తున్న ఓ వుద్యోగి క్లైన్‌ని చూసి విష్ చేసాడు మర్యాదగా.

"ఎలా జరిగింది ?" అడిగాడు క్లైన్ అతన్ని.

"ఏమో ? అరగంటక్రితం వచ్చి చెప్పారు కూలీలు — నయం. ఎవరిమీదా పడలేదు. ఇలా అవటం మామూలే ఇక్కడ." అన్నాడు అతను నవ్వి.

"బుల్‌డోజర్ తెప్పించు. వీళ్లతో అయే పని కాదు ఇది, త్వరగా."

"మనిషిని పంపాను. ఈపాటికి వస్తూండాలి, డ్రయివర్ యింట్లోనే వుంటే."

సిగరెట్ త్రాగుతూ పెట్రొమాక్స్ లైట్ల కాంతిలో పని చేస్తున్న కూలీలవంక, ఆడ కూలీల వంక దీక్షగా చూసాడు క్లైన్. బెర్రీక్లైన్ అంతవరకు హైక్లాస్, మిడిల్‌క్లాస్, ఒకళ్లిద్దరు అప్పర్ మిడిల్ క్లాస్ అమ్మాయిలనే చూసాడుకాని, లోక్లాస్ ఆడ వాళ్లని ఎప్పుడూ పరిశీలనగా చూడలేదు.

అరడజనుమందిదాకా వున్నారు. వాళ్లలో ఓ పదహారు, పదిహేడేళ్ల పిల్ల ఆకర్షించింది క్లైన్‌ని. అందరిలా కారునలుపుగా వున్నా అందంగా వుంది. గుండ్రటి మొహం, నల్లటి బొట్టు, విశాలమయిన కళ్లు, చిన్న నోరు, క్రింది పెదవి పై పెదవికన్నా కొంచెం లావుగా ధనుస్సులా వంపు తిరిగివుంది.

క్లైన్ కళ్లు జిగేలుమన్నాయి దృష్టి ఆ అమ్మాయిమీదకి వెళ్లగానే. నగ్నంగా వుంటే ఎలా వుంటుందో, తర్వాత పేరిస్‌లో 'గో—గో' డేన్స్ చేసే నర్తకి బట్టల్లో ఎలా వుంటుందో వూహించు కున్నాడు.

తనకి విడాకులిచ్చిన బ్రిగిటా కన్నా బావుంది అనుకోకుండా వుండలేకపోయాడు బెర్రీక్లైన్.

బుల్‌డోజర్ వచ్చింది పావుగంట తర్వాత. మరో పావుగంటలో ఆ బండరాయిని అడ్డంతీసింది బుల్‌డోజర్. ఆ కూలీలంతా కొంచెం దూరంలో వెలుగు కనపడుతున్న ప్రాంతానికి అడ్డదోవన వెళ్లడం గమనించి వాళ్ల నివాసం అక్కడే నను కున్నాడు క్లైన్.

హేండ్ బ్రేక్ తీసి, కొత్త వూహలతో, కొత్త ఆశలతో, కొత్త ఆలోచనలతో పైకి పోనించాడు బెర్రీక్లైన్ జీప్‌ని.

మర్నాడు ఉదయం అంతా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఆ రాత్రి...

చీకట్లో అస్పష్టంగా కనిపిస్తున్న గుడిసెల వంక చూసాడు బెర్రీక్లైన్, రహస్యంగా కొంచెం దూరంలో నిలబడి, వూపిరి బిగబట్టి.

క్లైన్ చేతికున్న రేడియం డయల్‌లో రెండూ యిరవై అయిదు అయిందని చూపిస్తున్నాయి ముళ్లు. దూరంగా లోయలో నక్కలు, మరేవో మృగాలు అరిచే అరుపులు, గాలిచేసే చప్పుడు, కీచురాళ్ల శబ్దం వినిపిస్తున్నాయి.

వూపిరి బిగబట్టి విన్నాడు క్లైన్. మరే చప్పుడూ లేదు. వేసం కాలం అరు బయట పడు కొని వున్న ఆ పది మంది కూలీలని చూస్తూంటే, తను చేయబోయే పనిని తలచుకుంటే, తన ధైర్యా నికి తనకే ఆశ్చర్యం వేసింది క్లైన్‌కి.

పిల్లిలా నడిచాడు ఆ అమ్మాయి వైపు. గాఢ నిద్రలో వున్న ఎవరికీ మెలకువ రాలేదు. చటుక్కున బలంగా గాలిలోకి ఎత్తి, భుజం మీద వేసుకుని, అరవకుండా నోరు గట్టిగా నొక్కి ఆ అమ్మాయితో క్లైన్ క్షణాల్లో తన జీప్‌ని చేరుకున్నాడు.

గేర్ వేసి, ముందే స్టార్ట్ చేసి వుంచిన ఆ జీప్‌ని పోనించాడు క్లైన్ కిందకి. గింజుకుంటూ, అరవడానికి ప్రయత్నిస్తున్న ఆ పిల్లని ఎడంచేత్తో నోరు నొక్కిపట్టుకుని, కుడి చేత్తో స్టీరింగ్ వీల్ కంట్రోల్ చేస్తూ కొండ కిందకి చేరుకున్నాడు బెర్రీక్లైన్ పది నిముషాల్లో.

రోడ్ వదిలి నిర్మానుష్యంగా వుండే సాండూర్ వ్యాలీ వైపు దూసుకుపోయింది జీప్.

ఆ అమ్మాయి ఏడుస్తూ, భయంగా క్లైన్ వంక చూస్తూ ఏదో చెబుతోంది తుళు భాషలో. అర్థం కాలేదు క్లైన్‌కి. అర్థమయినా చేసేవాడు కాదు ఆ అమ్మాయి చెప్పినట్లుగా.

మర్నాడు వుదయం చాలా సేపటిదాకా లేవలేదు బెర్రీక్లైన్. గెస్ట్‌హౌస్ కేర్‌టేకర్ పదిన్నరకి లేపితే మెలకువ వచ్చింది.

బెడ్ కాఫీ త్రాగి, సిగరెట్ తాగుదామని జేబులు తడిమాడు కాని, సాండూర్‌వ్యాలీ వైపు వెళ్ళేటప్పుడు, క్రితం రాత్రి తను వేసుకున్న దుస్తుల్లో వుండాల్సిన రీజెంట్ సిగరెట్ పాకెట్ కనపడలేదు.

ఇంకా దాంట్లో రెండు సిగరెట్స్ మిగిలిన గుర్తు. రాత్రి ఎక్కడో జారవిడుచుకుని వుంటా ననుకుని, క్రొత్త సిగరెట్ పాకెట్ విప్పాడు బెర్రీక్లైన్.

ఆ అమ్మాయి, ఆ ఒంటి వాసన, ఆ వంటి నునుపు, పళ్ళ పదును గుర్తు చేసుకున్నాడు సిగరెట్ పూర్తయేదాకా.

క్రషింగ్ ప్లాంట్ వైపు వెళ్ళాడు క్లైన్ పదకొండున్నరకి, బ్రేక్ ఫాస్ట్ ముగించి. నిశ్శబ్దంగా వుంది అంతా. పని జరగడంలేదు ఎక్కడా.

"ఏమయింది ?" అడిగాడు క్లైన్ ఓ వుద్యోగిని కొద్దిగా ఆశ్చర్యంగా.

"పనివాళ్ళెవరూ పనిలోకి రాలేదు. అంతా ఇవాళ కొండకిందే వుండిపోయారు" చెప్పాడతను.

"ఏం ?" అడిగాడు సిగరెట్ వెలిగించి, ఎలాంటి సమాధానం వస్తుందోనని ఆలోచిస్తూ.

"వాళ్లలో ఓ అమ్మాయి..."

ఆ ఉద్యోగి తన మొహంవంక చూడకుండా జాగ్రత్తపడ్డాడు బెర్రీక్లైన్, మొహం ప్రక్కకి తిప్పకుని.

"వాళ్లలో ఓ అమ్మాయి చచ్చిపోయిందిట. అందుకని పని మానేసారు."

"ఎలా పోయింది ?"

"ఇందాకే వ్యాలీలో శవాన్ని కనుక్కున్నారు. ఏదో మృగం చంపిందిట. రెండు మూడు ఎలుగు బంట్లు కనపడ్డాయి ఆమధ్య వ్యాలీలో ఆచోట."

క్లైన్ గుండె ఝల్లుమంది. అదృష్టం. తను ఏ మృగం వాతా పడలేదు. నెమ్మదిగా చేరుకుంటుం దని, తేరుకోవాలని, ఆ అమ్మాయిని ఆ స్థితిలో అక్కడే వదిలివచ్చాడు కావాలని. చేరలేదన్నమాట. ఒకందుకు మంచిదే ఇలా జరిగినందుకు.

"ఆ అమ్మాయి అసలక్కడికి ఎలా వెళ్లిందో, ఎందుకు వెళ్లిందో అర్థంకావటంలేదు నాకు" అన్నాడా ఉద్యోగి.

బెర్రీక్లైన్ మాట్లాడలేదు.

* * *

దాదాపుగా అడవిజాతి వాళ్లయినా ఆ కూలీలు బెస్ట్ ట్రేకర్స్ అని, జంతువులు, మనుష్యుల అడుగులనిబట్టి ట్రేక్‌చేసి ఎంత దూరమయినా వెంబడించగలరని తెలియదు ఫ్రాన్స్ నుంచి వచ్చిన బెర్రీక్లైన్‌కి.

మర్నాడు ఉదయం ఉద్యోగులు కొందరు బెర్రీక్లైన్‌ని కనుక్కున్నారు—ఓ తారు డ్రమ్ములో !

కొండమీదకి వెళ్లే రోడ్డు రిపేర్‌కోసం తేబడిన ఓ తారు డ్రమ్ములో, త్రాళ్లతో కట్టబడి వున్నాడు క్లైన్. బ్రతికుండగానే, ఆ డ్రమ్ములో, గడ్డందాకా ముంచి, క్రింద మంటపెట్టి, సలసల మరిగే ఆ తారులో యమయాతనపెట్టి చంపారు బెర్రీక్లైన్‌ని అతి క్రూరంగా.

చెక్కుచెదరని క్లైన్ మొహంలో, అతను అనుభవించిన చిత్రవధ తాలూకు ఛాయలు స్పష్టంగా కనబడుతున్నాయి.

నాగరికులు చేయగలిగే పని కాదది !

ఎవరి దృష్టినీ అంతగా ఆకర్షించకుండా ఓ వస్తువు కొంచెం దూరంలోనే నేలమీద పడివుంది. అది బెర్రీక్లైన్ తనతోపాటు తెచ్చుకుని, సేండూర్ వ్యాలీలో పోగొట్టుకున్న వస్తువు.

సిగరెట్‌పేక్.

రీజెంట్ సిగరెట్‌పేక్ !

దాంట్లో వున్న రెండే రెండు సిగరెట్స్ చెక్కు చెదరకుండా అలాగే వున్నాయి ! !


పెద్ద కథ

శుభోదయం

రచన: బొమ్మ హే[illegible]

త్వరలో ప్రారంభం